



# కరపత్రం

SINCE 2014

బుధవారం ఏప్రిల్ 22, 2026 సంపుటి : 2 సంచిక : 191 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ప్రభుత్వోద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీకి అనుమతి ఇచ్చింది. ఒకేచోట మూడేళ్లు దాటిన వారు బదిలీ కావడానికి అనుమతిని మంజూరు చేసింది. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియపై సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెల్లడించింది. ఇక, 2024లో చివరిసారిగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయి.



## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

- ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం

**జనగామ,ఏప్రిల్21**



సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.



## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం
## నార్వే బృందంతో మంత్రి శ్రీధర బాబు

**హైదరాబాద్,ఏప్రిల్ 21**

తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లక్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్
## పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు

- బీఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష



2లో..

**నల్గొండ,ఏప్రిల్21 :**

అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు.



## మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

» ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఏదీ

» ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్21 :**

తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్ధతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు.

2 లో

## పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

» 95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి



**హైదరాబాద్,ఏప్రిల్21 :**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణకు పదేళ్లలో కేంద్రం
## రూ.12 లక్షల కోట్లు

### రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్21 :**

తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత,



మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు.

2లో..

## ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా



- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్21 :**

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు.

మిగతాద్ది 2 లో

## హ్యాష్ ఆయిల్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు



2లో..

**హనుమకొండ:**

హ్యాష్ ఆయిల్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.5 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ సీపీ సన్‌ప్రీత్ సింగ్ మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. ముఠా సభ్యులు గంజాయి నుంచి హ్యాష్ ఆయిల్ తయారు చేస్తున్నారని తెలిపారు."హ్యాష్ ఆయిల్‌తో ఎక్కువ లాభాలు వస్తాయని పాండు అనే వ్యక్తి సలహా ఇచ్చాడు. దీంతో ముఠా సభ్యులు అధిక మొత్తంలో గంజాయి సేకరించి పాండుతో మాట్లాడుకున్నారు. యంత్రం సాయంతో పాండు..

## 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

» తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు

» తాజా రాజకీయ పరిణాలపై చర్చించే ఛాన్స్



**హైదరాబాద్,ఏప్రిల్ 21**

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది.

2లో..

## కేసీఆర్ హయాం నుంచే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు: ఎంపీ అర్వింద్

**హైదరాబాద్:**



భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు.

# ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోంది

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 22 నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఇప్పటికీ మొదలుపెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారంలోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ ఛైర్మన్ వెంకన్న. సమ్మె చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అందరూ సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్ధలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

మొదటి పేజీ తరువాయి

అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు

మొదటి పేజీ తరువాయి

అబద్ధాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ

ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# హ్యాష్ ఆయిల్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

మొదటి పేజీ తరువాయి

40 లీటర్ల హ్యాష్ ఆయిల్ తయారు చేశాడు. 20 కిలోలు తన వద్ద ఉంచుకొని.. మిగతా మొత్తం నిందితులకు ఇచ్చాడు. ముంబయిలో దానిని అమ్మేందుకు కోణార్క్ రైలులో ఒడిశా నుంచి బయల్దేరారు. రైలులో హ్యాష్ ఆయిల్ తరలిస్తున్నారనే సమచారంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశాం. నలుగురు నిందితుల వద్ద హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నాం” అని సీపీ వివరించారు.

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం’ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్

**– బైక్ ర్యాలీలపై ఇసి నిషేధం విధింపు**

అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశ పోలింగ్ ప్రచారపర్వం ముగిసింది. ఏప్రిల్ 23న బెంగాల్‌లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

# అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించిన మంత్రుల బృందం

వివిధ అంశాలపై శిక్షణ కోసం సింగపూర్ వెళ్లిన ఏపీ మంత్రులు అక్కడి అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించారు. అక్కడి థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మాల్స్, ఫెస్టివ్ ఆర్ట్ థియేటర్‌ను మంత్రుల బృందం పరిశీలించింది. వాటి విశేషాలను అక్కడి అధికారులు మంత్రులకు వివరించారు. వివిధ రంగాల్లో పలు అంశాలను వివరించారు. మంత్రుల బృందంలో నారాయణ, అనిత, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి ఉన్నారు. అక్కడి ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను సింగపూర్ అధికారులు మంత్రులకు వివరించారు.సింగపూర్‌లో ఆధునిక పరిపాలనా విధానాలను, మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఈ బృందం అధ్యయనం చేయనుంది. సింగపూర్ ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్‌తో ’సింగపూర్-ఎపి జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్’ అవగాహనా ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా సింగపూర్ పాలనా నమూనా, రాజకీయ జవాబుదారీతనం, నేషన్ ఫస్ట్ వంటి నాయకత్వ సూత్రాలపై నిర్వహించే ’ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్’ శిక్షణా కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటున్నారు.

# ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

**– ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి**

**– కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ**

భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా ఏటా రూ.22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

# తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం 23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరఫున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# కేసీఆర్ హయాం నుంచే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు: ఎంపీ అర్వింద్

మొదటి పేజీ తరువాయి

72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారు” అని అర్వింద్ విమర్శించారు.

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

మొదటి పేజీ తరువాయి

ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు

తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

# త్రిస్సూర్ బాణసంచా పరిశ్రమ పేలుడు ఘటన

**– 13కు చేరిన మృతుల సంఖ్య**

కేరళ త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన ఘటనలో మృతుల సంఖ్య 13 కు చేరింది. 30 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్‌లో నిల్వ ఉంచిన బాణసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగింది. స్థానికంగా పంటపొలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ఘటన సమయంలో మొత్తం అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సమీప ప్రాంతాల్లోనూ బాణసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుడు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బృందాలు వెల్లడించాయి. అయితే, అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదానికి ఓ కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులకు సూచించారు. తీవ్రంగా గాయాలైన బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇతర రాష్ట్రాల వైద్య నిపుణుల సాయం తీసుకోవాలని సూచించారు.

# మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద వైకారి వహిస్తుంది మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మల్లేష్ గౌడ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 21**
మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా చీకోటి ప్రవీణ్ కుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధి మెదక్ జిల్లా మీడియా ఇన్చార్జి మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ విలేకరుల సమావేశంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ :21 ఏప్రిల్, 2026: మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ..మహిళాసాధికారతకు అడ్డుతగులుతున్న కాంగ్రెస్: చారిత్రక తప్పిదాన్ని పునరావృతం చేస్తోందని మొన్న పార్లమెంటులో చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయి. దేశాభివృద్ధిలో సగభాగమైన మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక బిల్లును అడ్డుకోవాలని చూడటం ద్వారా కాంగ్రెస్ తన మహిళా వ్యతిరేక ధోరణిని మరోసారి చాటుకుంది.?ముఖ్య అంశాలు:?ద్వంద్వ ప్రమాణాలు: బయట మహిళా సాధికారత గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు, పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందకుండా అడ్డంకులు సృష్టించడం వారి నైతిక విలువల పతనానికి నిదర్శనం.?రాజకీయ స్వార్థం: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లుకు మోక్షం లభిస్తున్న తరుణంలో, కేవలం రాజకీయ లబ్ధి కోసమే





సభను తప్పుదోవ పట్టించడం శోచనీయ మనీ ?అభివృద్ధికి విఘాతం: మహిళలు చట్టసభల్లోకి వస్తే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిసినా, తమ ఉనికిని కాపాడుకోవడానికే కాంగ్రెస్ ఈ అడ్డంకులు సృష్టిస్తోంది.

?"కాంగ్రెస్ పార్టీకి మహిళా అభివృద్ధిపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, ఈ బిల్లుకు బేషరతుగా మద్దతు పలకాలి. కానీ నిన్నటి వారి ప్రవర్తన దేశ మహిళా లోకాన్ని అవమానించేలా ఉంది."
:మహిళా బిల్లు పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై ఆ పార్టీ నాయకత్వం దేశ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి, మహిళా రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని మేము డిమాండ్ చేస్తున్నాము
అని అన్నారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ , మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఈర్ల రంజిత్ రెడ్డి, సిహెచ్ శ్రీనివాస్ రామంపేట కౌన్సిలర్ శంకర్ , స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, ఓ బి సి మోర్చా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, వెలుముల సిద్ధిరాములు,మెదక్ జిల్లా మహిళా నాయకులు,మల్లిక మెదక్ కౌన్సిలర్ రాజమణి లక్ష్మణ్ సర్పంచ్ బెండవీన, శైలజ, స్వప్న మహిళా మోర్చా నాయకులు సంగీత, వెలుముల మహేశ్వరి. మౌనిక, లావణ్య, పబ్బ సత్యనారాయణ,కిసాన్ మోర్చా నాయకులు రమేష్ వెల్దుర్తి అంగడిపేట శ్రీనివాస్ వెల్దుర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆదర్శ్ బిజెపి సీనియర్ నాయకులు లోకేష్ అల్లం మధు తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలగొద్దు..

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మిషన్ భగీరథ నీటి సరఫరా లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. మంగళవారం వేములవాడ మండలం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రుద్రవరం ఇన్‌టెక్ వెల్‌ను కలెక్టర్ సంబంధిత గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రతి ఇంటికి నిరంతర నీటి సరఫరా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యంత్రాల మరమ్మత్తులు వెంటనే పూర్తి చేసి, నీటి శుద్ధి కేంద్రాల నుంచి రోజువారీ సరఫరా కొనసాగించాలన్నారు. అధికారులు సమన్వయంతో నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ కార్య నిర్వాహక ఇంజనీర్లు అన్వర్, సుమలత, డీఈ రాము తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా బీఎస్పీ నాయకులు శాంతయ్య మృతి

- కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపిన మెదక్ జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ సువాసిని రెడ్డి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 21**
మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ నాగులపల్లి గ్రామంలో బీఎస్.పి ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు శాంతయ్య మరణించడంతో వారి పార్థివదేహాన్ని దర్శించి పూల మాలవేసి ఘన నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి ఈ సందర్భంగా తెలంగాణ బహుజన ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేస్తూ, బహుజన రాజ్య స్థాపన కోసం తన చివరి శ్వాస వరకు శ్రమించిన నిస్వార్థ నాయకుడు శాంతయ్య అని అన్నారు. శాంతయ్య మృతి బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు సంతాపప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిరవీందర్,నాగులపల్లి సర్పంచ్ సుమతి శివకుమార్, లింగం,మోహన్ దాస్,సాయి శరణ్ గౌడ్,రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం (పి.ఏ.డి) పై అవగాహన అత్యవసరం

- యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ వైద్యులు .డా. ప్రభాకర్ సీనియర్ కన్సల్టెంట్, వాస్కులర్ సర్జన్, ఎండో వాస్కులర్ సర్జన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 21**
కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో వైద్యులు .డా. ప్రభాకర్ మాట్లాడుతూ, డయాబెటిస్ ఉన్న వారిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ సమస్య వేగంగా పెరుగుతోందని ఆయన వివరించారు. పి.ఏ.డి అనేది కాళ్లకు, పాదాలకు వెళ్ల రక్తనాళాలు ఇరుకుగా లేదా మూసుకుపోవడం వల్ల రక్తప్రసరణ తగ్గిపోవడం జరుగుతుంది అని తెలిపారు. డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి కూడా తెలియకపోవచ్చని హెచ్చరించారు.
నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, కాళ్లు త్వరగా




అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని గాయాలు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు.
డయాబెటిస్ రోగులు రక్త చక్కెరను నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని, అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు.ముందస్తు అవగాహన, సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా.ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈసందర్భంగా కరీంనగర్ జిల్లా వాసులకు ప్రతి నెల మూడవ మంగళవారం ఉదయం 10 గంటల. నుండి సాయంత్రం 4 గంటల వరకు యశోద మెడికల్ సెంటర్ లో ఓపిడీలు నిర్వహించబడుతున్నాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ప్రభాకర్ పాటు యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ సిబ్బంది నవీన్ చక్రవర్తి, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

# తుర్క కాశ లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన



- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తుర్క కాశ కమ్యూనిటీకి చెందిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొని, దరఖాస్తుదారుల వివరాలను అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ పథకం కింద టూల్ కిట్లు, జనరేటర్ల కోసం మున్సిపల్ పరిధి నుంచి మొత్తం 64 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 37 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అర్హత ప్రమాణాల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. తుర్క కాశ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టూల్ కిట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ నిబంధనల ప్రకారం లబ్ధి చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎంపికైన లబ్ధిదారులకు త్వరలోనే టూల్ కిట్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ భూలక్ష్మి అధికారులు, సిబ్బంది, కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానేపల్లి లో సమతుల్య ఎరువుల వినియోగం పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ ప్రతాప్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 21**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళవారం నాడు మానేపల్లి గ్రామంలో కెవికె తునికి నుండి సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్ట్ ప్రతాపరెడ్డి సమతుల్య ఎరువుల వినియోగం పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ ప్రతాపరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు అవసరమైన అన్ని పోషకాలు సరైన మోతాదులో ం సరైన సమయంలో ం సరైన విధానంలో ఇవ్వడమే సమతుల్య ఎరువుల వినియోగం గురించి రైతులకు వివరించామనీ,వరి పంటలో మంచి దిగుబడి రావాలంటే ఎన్పీకే (నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్) తో పాటు సూక్ష్మపోషకాలు కూడా సరైన మోతాదులో ఇవ్వాలని. ఒకే ఎరువు ఎక్కువగా వేస్తే మొక్క






పెరుగుతుంది కానీ దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని ,నైట్రోజన్ (ఎన్) మొక్క పెరుగుదల, ఆకుల పచ్చదనం కోసం అవసరం ఎక్కువ ఇస్తే: మొక్కలు ఎక్కువ పెరిగి పడిపోతాయి (లోడింగ్), తెగుళ్లు పెరుగుతాయి,ఫాస్ఫరస్ (పి),, వేర్లు బలంగా పెరగడానికి తొందరగా మొక్క ఎదగడానికి సహాయపడుతయని,పొటాష్ (కె)గింజ నింపుడు, దాణా బరువు పెరగడానికి వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందని,తదితర వివరాలు రైతులకు అవగాహన కల్పించడం జరిగిందనితెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రవేణీ ,సర్పంచ్ సోమప్ప పంచాయతీ కార్యదర్శి సురేందర్ రెడ్డి గ్రామ ప్రజలురైతులు పాల్గొన్నారు

# రూ. 4.34 కోట్లతో చెరువుల పునరుద్ధరణ పనులు

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఏప్రిల్ 21:**
రామగుండం నవ నిర్మాణంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ చేపడుతున్నామని ఎం.ఎల్.ఏ. రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తెలిపారు. అమృత్ 2.౦ నిధులు రూ. 2.53 కోట్లతో రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రశాంత్ నగర్ మల్లపు రాణి కుంట, రూ. 1.81 కోట్లతో మల్కాపూర్ బామశీడ్ల కుంట చెరువుల పునరుజ్జీవన పనులను నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరుజ్జీవన పనుల్లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటు స్థానికులకు ఆహ్లాదాన్ని అందించడానికి ఈ రెండు చెరువుల వద్ద గార్డెన్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మల్కాపూర్, ప్రశాంత్ నగర్ లోని లోతట్టు ప్రాంతాలు గతంలో వరద ముంపుకు గురై స్థానికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారని గుర్తు చేసుకున్నారు. మరో సారి వరద ముప్పు ఏర్పడకుండా కాలువల నిర్మాణంతో పాటు మేయర్ మహంకాళి స్వామి



నేతృత్వంలో కాలువల్లో పూడిక తీత పనులు చురుగ్గా నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులతో పాటు పేదలు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని వివరించారు. రామగుండంలో ఒకప్పుడు పవర్ ప్లాంట్ లలో కూలీలు గా పని చేసిన మహిళలు స్వంతంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని యజమానులు గా మారేలా తమ ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్నదని అన్నారు. రామగుండం నగరాన్ని వ్యాపార, విద్యా, వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా.. ఉపాధి కల్పనా కేంద్రంగా కూడా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. చెరువుల పునరుజ్జీవన పనులతో పాటు మూడవ డివిజన్ కార్పొరేటర్ వడ్లూరి రవి అభ్యర్థన మేరకు మరో కోటి రూపాయల పనులను ఎం.ఎల్.ఏ. మంజూరు చేశారని అన్నారు. మే నెల రెండవ వారంలో ఈ నిధులతో మూడవ డివిజన్ లో రోడ్లు, కాలువల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. నగరాన్ని సుందరీకరించడానికి ఒక పక్క ప్రయత్నం జరుగుతుంటే రోడ్లు, కాలువల్లో చెత్త వేయడం సరికాదని అన్నారు. ప్రజలు సహకరించి చెత్తను బయట వేయకుండా మునిసిపల్ వాహనానికి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పోరేటర్లు వడ్లూరి రవి, వెంగళ బాపు, చిదురాల నాగరాజు, కొలని కవిత, ధూళికట్ట సతీష్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం డి.ఇ. నర్సింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అబాకస్ లో విద్యార్థులకు సర్టిఫికెట్స్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 21:**




గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్లో అబాకస్ లో విజయం సాధించిన పిల్లలకు సర్టిఫికెట్లతో పాటు మెడల్స్ ను అందించారు. పాఠశాల హెచ్ఎం సూర్యదేవర జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అబాకస్ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను, గణిత శాస్త్రం ఉపయోగాలను సులభమైన పద్ధతిలో అబాకస్ ప్రాముఖ్యతను గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, పిల్లల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం ఏప్రిల్ 22, 2026

## బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు..



▪ బోనాలతో కిక్కిరిసిన క్యూలైన్లు

కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం భీమేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు, మంగళవారం ఆనవాయితీ ప్రకారం అమ్మవారిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. ?తెల్లవారుజాము నుండే భక్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు వండి, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సూపరింటెంట్ గుట్ట రాజు, ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్యూ లైన్ లో ఉన్న భక్తులకు చల్లటి త్రాగునీరు అందించారు.

## హుజూరాబాద్‌లో ఘనంగా కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 21

జమ్మికుంటకు చెందిన 217 మందికి ఆర్థిక సహాయం అందజేత హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట ప్రాంతానికి చెందిన 217 మంది అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు పెళ్లిళ్ల సమయంలో భారం తగ్గుతుందని, ఈ సహాయం వారి జీవితాల్లో ఒక పెద్ద ఉపశమనం కలిగిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ బత్తిని భాస్కర్, మండల గిర్దావార్ గడ్డం శంకర్, సత్యనారాయణతో పాటు గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం సాఫీగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పని చేశారు.

## గుంతలమయంగా సుభాష్ నగర్ రహదారి.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

▪ శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్



కరపత్రం ప్రతినిధి వేములవాడ

వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ రహదారి దుస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రావి చెట్టు నుంచి చాణక్య హాస్పిటల్ చౌరస్తా వరకు సిమెంటు రోడ్డు మార్గం పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదాచారులు నిత్యం కష్టాలు పడుతున్నారు. రోడ్డు అంతా చిన్నా, పెద్ద గుంతలతో నిండిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వెన్నుముక నొప్పుల వంటి ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పాదాచారులు కూడా సురక్షితంగా నడవలేని పరిస్థితి నెలకొంది. ఇదే మార్గం గుండా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులు, వీఐపీలు నిరంతరం ప్రయాణిస్తుండటం గమనార్హం. ముఖ్యంగా వినాయక చవితి, బతుకమ్మ, దసరా వంటి పండుగల సమయంలో తాత్కాలికంగా గుంతల్లో మొరం పోసి సమస్యను పరిష్కరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే వర్షాకాలంలో ఆ మొరం కొట్టుకుపోయి సమస్య మళ్లీ తలెత్తుతోందని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో సుభాష్ నగర్ రహదారికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు మున్సిపల్ చైర్మన్, అధికారులను కోరుతున్నారు.

## కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ ప్రకటన మొలుగూరి సదయ్యకు జిల్లా ఉపాధ్యక్ష పదవి

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 21



కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆమోదం మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ప్రకటించారు. ఈ నూతన కమిటీలో మొలుగూరి సదయ్యను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ... తన రాజకీయ ప్రస్థానం 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ద్వారా మోతుకులగూడెంలో ఎంపీటీసీగా పోటీ చేయడంతో ప్రారంభమైందని తెలిపారు. అనంతరం జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అలాగే బ్లాక్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించినట్లు వివరించారు. తన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పని చేసే ప్రతి కార్యకర్తకు ప్రోత్సాహకరమని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబుతో పాటు జమ్మికుంట పట్టణ, మండల ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నర్సాపూర్ రాయరావుచెరువు ఆయకట్టును సందర్శించినా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

- చెరువు నుండి రైతులు పండించుకుంటున్న పంట పొలలకు నీరు వెళ్లే కాలువలకు సరిగ్గా కల్వట్లు లేక నీరు వృధాగా పోతున్నాయి
- రైతుల పొలాలను సందర్శించి రైతుల ఇబ్బందులను అధికారులతో మాట్లాడి పనులను మొదలుపెడతామని తెలిపిన
- నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ఆవుల రాజిరెడ్డి







కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 21

మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఉన్న అతిపెద్ద రాయరావు చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే నీటి ప్రవాహంలో కొన్నిచోట్ల సరైన కల్వట్లు లేక రైతుల పొలాల వద్దకు నీటి ప్రవాహం సరిగా రాకపోవడంతో వరి పంట కోతలకు వచ్చే సమయం ఆసన్న మవడంతో వరి పంటను వెనుక ముందు వేసుకున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం నాడు నర్సాపూర్ పట్టణం నుండి ద్విచక్ర వాహనం పై వెళ్లి ఆ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. రైతులు పండించుకుంటున్నటువంటి పంటకు సరైన నీరు రాకపోవడంతో రైతులు ఎంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు అన్నారుఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన, సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా కల్వట్ల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో నూతనంగా ఎంపికైన 70 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నిర్మించుకున్న ఇండ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా అయినటువంటి సందర్భంలో ఆపద్బాంధవుడిగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి నాయకుడికి కార్యకర్తకు అండ దండలుగా నిలిచిన అందరివాడు పార్టీ పరువు ప్రతిష్టలను కాపాడినాకాంగ్రెస్ పార్టీకి ఆరాధ దైవం ఆవుల రాజిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# మాతృభూమి సేవ, సమాజ సేవ కోసం వందేళ్లు గా ఆర్ఎస్ఎస్

▪ ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ జీ...





కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 21

మాతృభూమి సేవ కోసం, సమాజ సేవ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్ జి అన్నారు. తిమ్మాపూర్ ఉపమండలం శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య వక్తక హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా దేశాహితం కోసం, హిందూ ధర్మ , సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగాలు సైతం అదే లక్ష్యంతో ఆయా రంగాలలో రాణిస్తున్నాయన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. ముఖ్యంగా సామాజిక సమరత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ ఆచరణ , పౌర బాధ్యత నియమాలు అనే ఐదు అంశాల ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం హిందూ సమ్మేళనాలు హిందూ సమాజం ఐక్యతతో కొనసాగాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని , హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాంత సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమాదేవి , జిట్స్ వేద పాఠశాల ప్రధాన చార్యులు కళకుట్ల వరప్రసాద్ఆచార్యులుమాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. ఆడపిల్లలను లవ్ జిహాద్ భారీ నుండి రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు మార్గాలను అనుసరించకుండా, సన్మార్గం పైపు పయనించడానికి ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గాల వైపు మనసును మళ్లించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ధర్మాన్ని రక్షించినప్పుడే ఆ ధర్మం కూడా మనల్ని రక్షిస్తుందని తెలిపారు.

శ్రీ అనంత పద్మనాభ స్వామి హిందూసమ్మేళనం కమిటీ బాధ్యులు , ఆర్ఎస్ఎస్ పెద్దలు కిషన్ జి, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పూల్లూరి రామారావు, తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, తిమ్మాపూర్ ఉప మండల ప్రముఖ్ కన్నం సాయి, తిమ్మాపూర్ ఉప మండలంలోని 8 గ్రామాల హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# టేకుర్తి హనుమాన్ స్వాములకు తీరని తిప్పలు -- ఉద్రిక్తతకు దారి తీసిన వివాదం





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 21

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన కాకతీయుల కాలం నాటి హనుమాన్ దేవస్థానం వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వాములు దీక్షలో భాగంగా కుటీరామ్ ఏర్పాటు చేసుకుని భిక్షాటన, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఎలాంటి అంతరాయం లేకుండా సాగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇటీవల వివాదానికి దారితీసాయి. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దేవాలయం పక్కన దర్గా లేదా మసీదు నిర్మాణం చేపట్టాలని ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విషయమై రామ్ రాజయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, స్థానిక మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు సమాచారం అందింది. అనంతరం విద్యాశాఖ అధికారులు అక్కడికి చేరుకుని, స్వాములు తాత్కాలికంగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినట్లు సమాచారం. ఈ పరిణామంపై స్వాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. “దేవుడు ఉన్న ప్రదేశం నుంచి మమ్మల్ని వెళ్లమంటే మేమెక్కడికి వెళ్లాలి? మేము దీక్షలో ఉన్నాము. అయినా అధికారులు ఇబ్బందులు పడుతున్నారని భావిస్తే, దేవుణ్ణి ఎక్కడికి తరలించినా మేము అక్కడికే వెళ్లడానికి సిద్ధం” అని వారు తెలిపారు. అయితే ఈ అంశాన్ని రాజకీయంగా మలచకూడదని హెచ్చరించారు. అలాగే సమస్య పరిష్కారం కాకపోతే కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వాములకు పిలుపునిచ్చి ఇల్లందకుంట రోడ్లపై భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, నగేష్, కొమురయ్య, శ్రీనివాస్, సతీష్, అరుణ్ తదితర స్వాములు పాల్గొన్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉండగా, అధికారులు శాంతి భద్రతల దృష్ట్యా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# జమ్మికుంట తహసీల్దార్ వెంకట్ రెడ్డి తండ్రి హఠాత్ మరణం

▪ ఘన నివాళులు

▪ నేతల పరామర్శతో కుటుంబానికి ధైర్యం





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 21

జమ్మికుంట తహసీల్దార్ వెంకట్ రెడ్డి తండ్రి నల్లా నారాయణరెడ్డి హఠాత్ మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ప్రాంతంలో శోకచ్ఛాయలు అలుముకున్నాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామానికి చేరుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కౌన్సిలర్లు ఏగిత అశోక్, పొనగంటి విష్ణు, మాచర్ల రాజు, పాతకాల అనిల్, గుర్రం పరుశురాం, యట్ల అశోక్, కూతాడి తిరుపతి, మారేపల్లి అజయ్ కుమార్ తదితరులు పాల్గొని నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.